భద్రతతో ఉత్పత్తి సాధించాలి

రామగిరి, మార్చి 1: భద్రతతో నిర్దేశిత ఉత్పత్తిని సాధించాలని ఆర్జీ–3 జీఎం ఎన్ సుధాకర్‌రావు సూచించారు. గడిచిన ఫిబ్రవరిలో సింగరేణి ఆర్జీ–3 ఏరియాలో 104 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు శనివారం వెల్లడించారు. గత నెల ఆర్జీ–3 ఏరియాకు 5.44లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గానూ 5.64లక్షల టన్నులతో 104శాతం సాధించినట్లు తెలిపారు. అలాగే 40.30లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత లక్ష్యానికి గానూ 37.05లక్షల క్యూబిక్ మీటర్లు 92శాతం ఓబీ వెలికితీసినట్లు తెలిపారు. అదేవిధంగా 5.92లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. ఫిబ్రవరిలో ఓసీపీ–1గనికి నిర్దేశించిన 2.70లక్షల టన్నులకు 2.93లక్షల టన్నులతో 107శాతం, ఓసీపీ–2 గనికి నిర్దేశించి 2.70లక్షల టన్నుల లక్ష్యానికి 2.70లక్షల టన్నులతో వంద శాతం ఉత్పత్తి సాధించామన్నారు.

ఏపీఏ ఏరియాలో 66శాతం

ఏపీఏ ఏరియాలో గడిచిన నెలలో 66 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏపీఏ జీఎం కే నాగేశ్వరరావు తెలిపారు. అడ్రియాల లాంగ్‌వాల్ గనికి ఫిబ్రవరి నిర్దేశించిన 66శాతం ఉత్పత్తితోపాటు 0.12లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. అధికారులు, సూపర్‌వైజర్లు, సీనియర్ ఉద్యోగుల సలహాలు, సూచనలు పాటిస్తూ కొత్తగా విధుల్లో చేరిన బదిలీ వర్కర్లు వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవాలని సూచించారు.

ఆర్జీ-1లో 4,22,869 టన్నులు..

గోదావరిఖని, మార్చి 1: ఫిబ్రవరిలో సింగరేణి ఆర్జీ–1 పరిధిలో 3,84,800 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 4,22,869 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు సింగరేణి ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ వెల్లడించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి 110శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. ఈ ఆర్థిక సం వత్సరంలో ఫిబ్రవరి వరకు 44,92,400 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గానూ 42,21,765 టన్నులతో 94శాతం ఉత్పత్తి సాధించామన్నారు. ఫిబ్రవరి 19న 2,800టన్నుల రోజువారి బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గానూ రికార్డు స్థాయిలో శనివారం 5,600 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రికార్డు సృష్టిం చినట్లు తెలిపారు. మూసివేసిన మేడిపల్లి ఓసీపీ 4క్వారీలో స్టోర్ చేసిన నీటిని కాల నీలకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ఆర్జీ-2లో 94శాతం..

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి1: సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఏరియాలో 2024–25 వార్షిక సంవత్సరంలో 87.80లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గానూ 82.94లక్షల బొగ్గు ఉత్పత్తి (94శాతం) చేరుకున్నట్లు ఏరియా జీఎం బండి వెంకటయ్య వెల్లడించారు. శనివారం కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎం వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరిలో 10.47లక్షల టన్నులకు గానూ 10.35లక్షల టన్నుల ఉత్పత్తి (99శాతం) సాధించినట్లు తెలిపారు. ఓబీ 57లక్షల క్యూబిక్ మీటర్ల ఉత్పత్తికి గాను 53లక్షల 49వేల క్యూబిక్ మీటర్లు (94శాతం) వెలికితీశామన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని తీర్చడం కోసం వకీలుపల్లి గని, ఓసీపీ–3 ప్రాజెక్టు నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసి కార్మిక కుటుంబాలకు నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం రాముడు, ఏరియా ఇంజినీర్ నర్సింహరావు, డీజీఎంలు ధనుంజయ్, ఎర్రన్న, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- పంచాయతీరాజ్, ఇంజినీరింగ్‌శాఖల అధికారులతో సమీక్షా సమావేశం

జ్యోతినగర్: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మార్చి 1: పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశించిన వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. హెల్త్ సెంటర్ల మరమ్మతులు, పాఠశాలల మరమ్మతు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మతులకు నిధులు మంజూరు చేశామని, నిధులను వినియోగించుకుంటూ వచ్చే నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ కింద మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులను ఈ నెల 15లోగా పూర్తి చేసి బిల్లులు సమర్పించాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ గిరీష్‌బాబు, సీపీవో రవీందర్ పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి (2024–25) నిర్దేశించుకున్న బ్యాంకు లింకేజీ రుణలక్ష్యాలను ఈ నెల 15లోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వశక్తి మహిళా సంఘాలపై సంబంధిత అధికారులతో సమావేశమై, మాట్లాడారు. ఇప్పటి వరకు 90శాతం రుణాలు పంపిణీ చేశామని, పెండింగ్ ఉన్న 10శాతం బ్యాంకు లింకేజీ రుణాలను ఈ నెల 15 వరకు పూర్తి చేయాలని సూచించారు. మహిళా సంఘాలతో పెట్రోల్‌బంక్, గ్యాస్ ఏజెన్సీ, డెయిరీ వంటి పెద్ద యూనిట్ల స్థాపనకు చర్యలు చేపట్టాలని సూచించారు. వీ–హబ్ ద్వారా శిక్షణ అందించేందుకు వీలుగా జిల్లాలో వంద మంది మహిళలను సన్నద్ధం చేయాలని, ముత్తారం మండలంలోని మిర్చి యూనిట్ ఏర్పాటుకు మహిళా సంఘాల ద్వారా రూ.7.5లక్షల డిపాజిట్ చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ కోసం క్లాత్ వారంలో జిల్లాకు చేరుకుంటుందని, మహిళా సంఘాల ద్వారా కుట్టు పని జరగాలన్నారు. మంథని మండలంలోని సిరిపురం, కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో ఎం కాళిందిని, అడిషనల్ డీఆర్డీవో రవికుమార్, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎల్ ఆర్ఎస్, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, లేబర్ టర్న్‌అవుట్, ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌పై అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్డీవో ఎం కాళిందిని, హౌసింగ్ ఈఈ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి..

వివిధ కోర్సుల్లో శిక్షణ పొందడానికి గానూ నిరుద్యోగులు జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని టాస్క్ సెంటర్‌లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెబ్ అప్లికేషన్స్, జావా ప్రోగ్రామింగ్, పైథాన్ ప్రోగ్రామింగ్, సీ ప్రోగ్రాం, సీ ప్లస్ ప్రోగ్రామింగ్, టాటా ప్లస్ ప్రోగ్రామింగ్, అర్థమెటిక్ అండ్ రీజనింగ్, ప్రజెంటేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, టాలీ, జీఎస్టీ తదితర కోర్సులలో ఇంజినీరింగ్, డిగ్రీ, ఎంసీఏ, పాలిటెక్నిక్ చదువుతున్న లేదా పూర్తి చేసిన విద్యార్థులు శిక్షణ తీసుకోవడానికి అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు వివిధ బహుళ జాతి సంస్థల ద్వారా ఉద్యోగవకాశాలు కల్పించడానికి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఔత్సాహికులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోడల్ వార్డులను తయారుచేయాలి

జ్యోతినగర్, మార్చి 1: విధులను పారదర్శకంగా నిర్వహిస్తూ వార్డులను మోడల్ వార్డులుగా తయారు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం ఎన్టీపీసీ ఈడీసీ ఆడిటోరియంలో నూతనంగా గ్రూప్–4 ద్వారా ఎంపికైన వార్డు అధికారులు జూనియర్ అసిస్టెంట్లు, అకౌంట్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి హాజరై, మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఇక్కడ పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

వేడుకలు విజయవంతం చేయాలి

రామగిరి, మార్చి 1: ఈనెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని సింగరేణి ఆర్జీ–3 సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు స్థానిక సేవాభవన్‌లో సభ్యులతో కలిసి వేడుకల ఏర్పాట్లపై శనివారం సమీక్షించారు. 8న స్థానిక కమ్యూనిటీ హాలులో సింగరేణి ఆధ్వర్యంలో జరిగే మహిళా దినోత్సవం వేడుకల్లో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయనీ, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పర్సనల్ అధికారి సుదర్శనం, డీజీఎం శ్రీహరి, కోఆర్డినేటింగ్ అధికారి రాజేశం, సేవా కార్యదర్శి మల్లీశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, సుధాకర్, సేవా సభ్యులు పాల్గొన్నారు.

లీకేజీ ఆగింది.. సమస్య తీరింది

- 'నమస్తే' కథనానికి స్పందన

కోల్‌సిటీ, మార్చి 1: రామగుండం నగరపాలక సంస్థ 30వ డివిజన్ పరిధి సీతానగర్ బోర్డు వద్ద నెల రోజులుగా మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీ అయి నీరంతా వృథాగా పోతుంది. 'పైపులైన్ లీకేజీ.. పట్టింపు ఏదీ?' నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనా నికి అధికారులు స్పందించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టారు. లీకేజీని ఆపి.. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన అధికారులకు డివిజన్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మంథని-పెద్దపల్లి ఫ్లైఓవర్‌పై నిలిచిన లారీ

- కిలోమీటర్ మేర ట్రాఫిక్‌జామ్

మంథని–పెద్దపల్లి ఫ్లై ఓవర్‌పై నిలిచిపోయిన వాహనాలు

పెద్దపల్లి టౌన్, మార్చి 1: పెద్దపల్లి–మంథని వైపు వెళ్లే రాజీవ్ రహదారిపై మట్టి లారీ చెడిపోయి నిలిచిపోయింది. దీంతో శనివారం సాయంత్రం పెద్దపల్లి నుంచి మంథని–గోదావరిఖని వైపు రెండు వైపులా దాదాపు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని లారీని ట్రాక్టర్ సాయం తొలగించారు. దీంతో 30 నిమిషాలపాటు మంథని–గోదావరిఖని వైపు వెళ్లే వాహనాదారులు ఇబ్బందిపడ్డారు.

పెన్షనర్ల సమస్యలపై పోరుబాట

సమావేశంలో నినదిస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులు

రామగిరి, మార్చి 1: ఇంతకాలం పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఇక పోరుబాట పడుతున్నారు. శనివారం సెంటినరీ కాలనీలోని రాణీ రుద్రమదేవి స్టేడియంలో సింగరేణి ఆల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశమై భవిష్యత్ కార్యచరణను ప్రకటించారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీ ఆందోళనలు ఉధృతం చేయాలని నిశ్చయించారు. రిటైర్డ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన పెన్షన్ సవరణ చేయకపోవడంతో మాజీ కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, లైవ్ సర్టిఫికెట్ ఇవ్వలేదనే కారణంతో కొన్ని వేల మందికి పెన్షన్లు నిలిపివేయడం అన్యాయమన్నారు. వెంటనే 11వ వేజ్‌బోర్డు ఆధారంగా పెన్షన్ సవరణ చేయకపోతే దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గౌతం శంకరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సింగరేణి రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లిరూరల్, మార్చి 1: రఘువాపూర్‌లో తాటిచెట్టి లక్ష్మి(80) కొద్దిరోజుల క్రితం మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. లక్ష్మి కొడుకు తాడిచెట్టి సారయ్య, మనమడు శ్రీకాంత్‌ను ఓదార్చారు. ఇక్కడ బీఆర్ఎస్ నేతలు బండారి శ్రీనివాస్‌గౌడ్, మర్కు లక్ష్మణ్, అంతగిరి కొమురయ్య, కుమార్, రమేశ్, స్వామి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దపల్లి, మార్చి1: రంగంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పెద్దపల్లి ఏడీఈ సీహెచ్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8నుంచి 9.30గంటల వరకు పెద్దపల్లి, రంగంపల్లి, నిట్టూరు పెద్దబొంకూర్, పెద్దకల్వలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాపర్‌వైరు దొంగల అరెస్ట్

అంతర్గాం, మార్చి 1: ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్‌వైరు చోరీలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను అంతర్గాం పోలీసులు అరెస్ట్ చేశారు. గత ఫిబ్రవరి 22న ట్రాన్స్‌కో ఏఈ ఆసా శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇదివరకే ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ మేరకు శనివారం బ్రాహ్మణపల్లి వద్ద పెద్దపల్లికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురుచూస్తున్న పరారీలో ఉన్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. కాగా, పట్టుబడిన వారిలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చింతల చంద్రమౌళి, వానరాసి లక్ష్మణ్, చింతల శ్రీను ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 45కిలోల కాపర్‌వైరు స్వాధీనం చేసుకొని, ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిపై ఇప్పటికి వివిధ పోలీస్‌స్టేషన్లలో 14కేసులు నమోదైనట్లు చెప్పారు.

10జీపీఏ సాధిస్తే విమాన ట్రిప్

- బేగంపేట జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వినూత్న ప్రకటన

మాట్లాడుతున్న ఏపీఎం డా షేక్, హెచ్ఎం మల్క కిషన్‌రావు

రామగిరి, మార్చి 1: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఎవరైతే 10 జీపీఏ సాధిస్తారో.. వారిని విమానంలో బెంగుళూరు వరకు తీసుకెళ్లనున్నట్లు బేగంపేట జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం మల్క రాంకిషన్‌రావు వినూత్న కానుకను ప్రకటించారు. తన సొంత ఖర్చులతో విమానంలో తీసుకెళ్తానని తెలిపారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరీక్షలకు ముందు 20 రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు నిర్వస్తామని, ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఇక్కడ సమగ్ర శిక్ష ఏపీఎం డా షేక్, ఉపాధ్యాయులు పద్మజ, శ్రీనివాస్, సంపత్, గీతారాణి, శ్రీదేవి, మంగ, స్వరూప, పీఈటీ శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం

ముత్తారం, మార్చి 1: ఓడేడ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ, విద్యార్థులకు పదో తరగతి జీవితంలో మొదటి మెట్టు అని, వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పాఠశాలలో ఆటపాటలతో అలరించారు. ఇక్కడ ఉపాధ్యాయులు సునీల్‌రెడ్డి, విజయ్‌కుమార్, కమలాకర్, మమత, తదితరులు ఉన్నారు.

జూలపల్లి, మార్చి 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆత్మీయం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులు సెకండియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆటాపాటలు, నృత్యాలు చేస్తూ విద్యార్థులంతా హోరెత్తించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్, అధ్యాపకులు పవన్‌కుమార్, మహేందర్, రమేశ్, రవిచంద్రన్, విజేందర్, వనిత, అంజయ్య, శ్రీనివాస్, తిరుపతి, సమత ఉన్నారు.

జూలపల్లి: జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్

నమస్తే తెలంగాణ
CLASSIFIED
CHANGE OF NAME
★ Nalla Lavanya W/o. Nalla Mahendar (Old Name) H.No. 2-23, V/o.Ramraopally Sanugula Chandurthi Mandal Rajanna Sircilla Dist. Have Changed My name as NALLA GOUTHAMI W/o. NALLA MAHENDAR (New Name)
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ఆర్ఎఫ్‌సీఎల్‌లో 1,03,912.38 మెట్రిక్ టన్నుల యూరియా

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 1: రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో గత ఫిబ్రవరిలో 1,03,912.38 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి జరిగినట్లు ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ్ రాజహంస ప్రకటించారు. ఇందులో తెలంగాణకు 58,063మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 29,545.11మెట్రిక్ టన్నులు, కర్నాటకకు 10,685.79మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 5,618.16 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు తెలిపారు. దేశంలో ఎరువుల కొరతను తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో 2021 మార్చి22న ప్రారంభించిన ఆర్ఎఫ్‌సీఎల్ పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నట్లు చెప్పారు.

కొప్పుల సత్యనారాయణకు అరుదైన గౌరవం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 1: కిష్టంపేటకు చెందిన విత్తనోత్పత్తి రైతు కొప్పుల సత్యనారాయణకు అరుదైన గౌరవం దక్కింది. వివిధ రకాల వరి విత్తనాలను స్వంతంగా తయారు చేసినందుకు భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఉత్తమ రైతు అవార్డు అందజేసి సత్కరించింది. దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ కృషి విజ్ఞాన కేంద్రం జహీరాబాద్‌లోని కృషివిజ్ఞాన కేంద్రాలకు శిక్షణ, అవగాహన కల్పించారు. కొప్పుల సత్యనారాయణకు భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో డాక్టర్ త్రిలోచన మహాపాత్ర చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులప తి డాక్టర్ దండ రాజిరెడ్డి, విశ్వవిద్యాలయ డైరెక్టర్లు సత్యనారాయ ణను అభినందించారు. ఇక్కడ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, డాక్టర్ వినోద్‌కుమార్ ఉన్నారు.

మండల కార్యవర్గం

జూలపల్లి, మార్చి 1: జూలపల్లిలో బ్రాస్ బ్యాండ్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సాహెబ్‌హుస్సేన్, మండలాధ్యక్షుడిగా షాబొద్దీన్, ఉపాధ్యక్షులుగా కనకట్ల నర్సింగం, దూట లచ్చయ్య, కార్యదర్శిగా మొగురం అంజయ్య, సహాయ కార్యదర్శులుగా లంక భూమయ్య, రఫీ, కోశాధికారిగా రజ్జబెల్లి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే సభ్యులుగా శంకరయ్య, బాబు, నర్సయ్య, మహ్మద్, రాజయ్య, మల్లేశం నియామకం అయ్యారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు రాజయ్య, ప్రధాన కార్యదర్శి సాహెబ్‌హుస్సేన్, తదితరులు ఉన్నారు.

వేతనాలు అమలు చేయాలి

గోదావరిఖని, మార్చి 1: జీడీకే 2, 2ఏ క్యాంటీన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్యాటగిరీ వేతనాలను అమలు చేయాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన 2, 2ఏ ఇంక్లైన్ క్యాంటీన్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాంటీన్ వర్కర్స్‌ను పర్చేస్ నుంచి సివిల్ డిపార్టుమెంట్‌కు మార్చాలన్నారు. ఇక్కడ యూనియన్ ఆర్జీ–1 అధ్యక్షుడు ఎంఏ గౌస్ ఉన్నారు.

జనరల్ అసిస్టెంట్‌గా మార్పు హర్షనీయం

గోదావరిఖని, మార్చి 1: బొగ్గు సంస్థలలో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ పేరును జనరల్ అసిస్టెంట్‌గా మార్చడం అభినందనీయమని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో బొగ్గు రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పెంపుదల, మెరుగైన వైద్య సౌకర్యాలు అపరిమితంగా, ఉచితంగా కల్పించడానికి కృషి చేయాలని ఆయన కోరారు.

యూరియా బస్తాల విక్రయాలపై విచారణ

ఓదెల, మార్చి 1: పొత్కపల్లి సహకార సంఘంలో 444యూరియా బస్తాల డబ్బులు వారం రోజులగా బ్యాంక్‌లో జమ చేయలేదని అధికారులు విచారణ చేపట్టారు. యూరియా బస్తాల విక్రయాల సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని తేలింది. అధికారులు విచారణకు వస్తున్నారని తెలిసి శనివారం 444బస్తాల డబ్బులు రూ.1,16,370 బ్యాంక్‌లో జమచేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అలా చేయాల్సి వచ్చిందని సహకారం సంఘం సిబ్బంది విచారణ అధికారులకు వివరించారు. అలాగే కొందరు రైతులు ఫోన్‌పే ద్వారా చెల్లించగా, ఆ డబ్బులను డ్రా చేసి బ్యాంక్‌లో జమ చేయాల్సి ఉండగా, కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని ఒప్పుకొన్నారు. కాగా, సహకార సంఘానికి వచ్చిన స్టాక్, ఇతర విషయాలపై విచారణ జరుపుతున్నట్లు కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టార్ వెంకటేశ్వర్లు, ఏవో భాస్కర్ తెలిపారు.

సైకాలజిస్టులకు శిక్షణ

కోల్‌సిటీ, మార్చి 1: సైకాలజిస్టుల నైపుణ్యాభివృద్ధి కోసం ఈ నెల 10నుంచి 13 వరకు నాలుగు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ (టీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డా మోతుకూరి రాంచందర్, రాష్ట్ర నాయకుడు మేజిక్ రాజా పేర్కొన్నారు. రాష్ట్రంలోని సైకాలజిస్టుల నైపుణ్యాభివృద్ధి ధ్యేయంగా టీపీఏ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 10 నుంచి 13 వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్‌లో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నంబర్‌లో (95336 60938) సంప్రదించాలని కోరారు.

కమిషనరేట్‌కు మూడు పోలీస్ జాగిలాలు

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 1: మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఏడాదిపాటు శిక్షణ పొందిన 24వ బ్యాచ్‌కు చెందిన జాగిలాలు పాసింగ్ అవుట్‌తో శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు చేరుకున్నాయి. ఈ మేరకు పోలీస్ కమిషనరేట్ శ్రీనివాస్ జాగిలాల పనితీరును వెల్లడించారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, సీసీ హరీశ్, ఉన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

జూలపల్లి, మార్చి 1: పెద్దాపూర్‌లోని బస్టాండ్ కూడలిలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇక్కడ జిల్లా లీగల్ సెల్ అథార్టీ చైర్‌పర్సన్ స్వప్నారాణి, సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, కార్యదర్శి జోగుల రమేశ్, ఏజీపీ దూడం ఆంజనేయులు, ఎస్ఐ సనత్‌కుమార్, మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు ఉన్నారు.

జ్యోతినగర్, మార్చి1: ఎన్టీపీసీలోని ఈడీసీ మిలినీయం హాల్‌లో శనివారం స్థానిక సచ్‌దేవ ఎక్స్‌లెన్సీ పాఠశాలలో గోదావరిఖని మండల న్యాయ సేవాసమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు అడిషనల్ డిస్టిక్ సెషన్స్ జడ్జి టీ శ్రీనివాసరావు హాజరై, మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలన్నారు. ఇక్కడ ఏజీపీ శంతన్‌కుమార్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, న్యాయవాదులు కుడికందుల భూమయ్య, కాదాసి శేఖర్, సోషల్ వర్కర్ శంకర్, స్కూల్ ప్రిన్సిపాల్ జ్ఞానచంద్ ఉన్నారు.

సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సమస్యలు పరిష్కరించాలని సీఎండీకి వినతి

గోదావరిఖని, మార్చి1: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి గుర్తింపు సంఘం కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ శనివారం సింగరేణి సీఎండీ బలరాంకు సింగరేణ్ భవన్‌లో వినతిపత్రం అందజేశారు. కోల్ ఇండియా తరహాలో హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, అప్పటివరకు జీవో 22ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. పం డుగ సెలవులు, లీవులు ఇవ్వాలని, కార్మిక కుటుంబాలకు వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. ఇక్కడ కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్ నేతలు అక్బర్‌అలీ, తిరుపతి, అప్రోజ్‌ఖాన్ ఉన్నారు.

పెండింగ్ సమస్యలపై వినతి

సింగరేణిలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి సింగరేణి సీఎండీకి వినతిపత్రం అందజేశారు. సింగరేణి కార్మికుల సొంతింటి కల 250 గజాల భూమి కేటాయింపు, ₹30లక్షల వడ్డీలేని హౌస్ బిల్డింగ్ అడ్వాన్స్ కల్పించాలని, కోల్‌ఇండియా ఉద్యోగుల తరహాలో ఆదాయపన్నును యాజమాన్యమే చెల్లించాలన్నారు. మారుపేర్ల మార్పు, విజిలెన్స్ సమస్య పరిష్కారం, సంస్థలోని ఖాళీల భర్తీ, రామగుండం, ఎస్ఆర్పీ, కొత్తగూడెంలో సూపర్ స్పెషాలిటీ దవాఖానల ఏర్పాటు, శిశు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు, ఉద్యోగుల హోదాల మార్పు, ప్రమోషన్లు, ఎన్1 విధానం రద్దు, మెడికల్ అన్‌ఫిట్ వారికి మరోసారి అవకాశం కల్పించాలన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

కాల్వశ్రీరాంపూర్, మార్చి1: పెగడపల్లి సన్‌షైన్ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివెల్ నిర్వహించారు. విద్యార్థులు సుమారు 115రకాల వంటకాలను ప్రదర్శించారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్‌తోపాటు పలువురు హాజరై విద్యార్థులు చేసిన వంటకాల రుచి చూసి వారిని అభినందించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇక్కడ పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ నసీర్, మాజీ సర్పంచ్ సుజాత రమేశ్ ఉన్నారు.

భవనాల పరిశీలన

ఓదెల, మార్చి 1: మండల కేంద్రంలో మంజూరైన కోర్టు ఏర్పాటుకు అద్దె భవనాలను సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి గణేశ్ శనివారం పరిశీలించారు. ఓదెల గ్రామంలో కోర్టు ఏర్పాటుకు అనువైన మూడు అద్దె భవనాలను పరిశీలించారు. ఇక్కడ త్వరలోనే కోర్టును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ పొత్కపల్లి ఎస్ఐ రమేశ్, కోర్టు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జేమ్స్ మోడల్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

ఫుడ్ ఫెస్టివల్ వంటకాలతో విద్యార్థుల ప్రదర్శన

పాలకుర్తి, మార్చి1: ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలోని జేమ్స్ మోడల్‌స్కూల్‌లో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఆరోగ్యానికి సంబంధించిన పలురకాల పోషకాలనించే వంటల గురించి విద్యార్థులు వివరించారు. సుమారు 60రకాల వంటకాలను విద్యార్థులు తయారుచేశారు. ఇక్కడ కరస్పాండెంట్ జూలపల్లి మహేశ్, హెచ్ఎం జూలపల్లి స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో

ఓదెల, మార్చి 1: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, కొలనూర్‌లోని హైస్కూల్‌ను డీఈవో మాధవి శనివారం సందర్శించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రీ ఫైనల్ మార్కులను పరిశీలించారు. విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భయపకుండా పరీక్షలకు సిద్ధంకావాలని సూచించారు. ఇక్కడ ఎస్‌వో జ్యోతి, హెచ్ఎం నిట్టూరి యేసుదాస్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్

పెద్దపల్లి టౌన్, మార్చి 1: విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేకంగా విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్ ప్రభుతాన్ని విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు అన్నివిధాలా వెనుబడి ఉన్నారని, ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులను గుర్తించి చేయూతనివ్వాలని వేడుకున్నారు. ఇక్కడ ఐక్య సంఘం నాయకులు చెల్లోజు రాజు, గోవర్ధన్ శాస్త్రి, రాజ్యలక్ష్మి, ప్రసాద్, ఆంజనేయులు, వైకుంఠాచారి, శ్రీనివాస్ చారి, రాజేందర్, నర్సింహచారి, తదితరులు ఉన్నారు.

₹కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

గోదావరిఖని, మార్చి1: ఎస్ఎల్‌బీసీలో ప్రమాద మృతుల కుటుంబాలకు ₹కోటి చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సేఫ్టీ నిర్లక్ష్యంతోనే ప్రమాదం చోటుచేసుకున్నదని, కార్మికుల ప్రాణాలకు ప్రభుత్వం రక్షణ కల్పించడం లేదన్నారు. కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలన్నారు.